డబుల్ రోడ్డుకు మోక్షమెప్పుడో..

- కలగానే మిగిలిన మోటకొండూర్– వంగపల్లి డబుల్ రోడ్డు
- ప్రతిపాదనలతోనే సరిపెడుతున్న అధికారులు

యాదగిరిగుట్ట రూరల్: వంగపల్లి గ్రామం నుంచి, మోటకొండూర్ వరకు రెండు వరుసల రోడ్డుకు మోక్షం కలగడం లేదు. డబుల్ రోడ్డు ఏర్పడి రాకపోకలు సాఫీగా అవుతాయని ఆశించిన ఆయా గ్రామాల ప్రజల ఆకాంక్ష నెరవేరడం లేదు. మోటకొండూర్ మండల కేంద్రం నుంచి వంగపల్లి గ్రామం బైపాస్ వరకు 9 కిలోమీటర్ల రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ మార్గం గుండానే మోటకొండూర్ మండల ప్రజలతో పాటు, యాదగిరిగుట్ట మండల ప్రజలు జిల్లా కేంద్రమైన భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరుతో పాటుగా, హైదరాబాద్‌కు వివిధ పనుల నిమిత్తం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా ఆత్మకూరు, మోత్కూర్ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఆలేరు, యాదగిరిగుట్ట ప్రాంతాలకు వెళ్లడానికి కూడా ఈ మార్గం సులువుగా ఉంటుంది.


వంగపల్లి-మోటకొండూర్ మధ్యన సింగిల్ రోడ్డు

గతంలోనే ప్రతిపాదనలు

ఎన్‌హెచ్ 163 వద్ద వంగపల్లి నుంచి మోటకొండూర్ మండల కేంద్రానికి రెండు వరుసల రోడ్డును నిర్మించాలని గత ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినా కార్యరూపం దాల్చలేదు. గత రెండున్నర సంవత్సరాల క్రితం వరకు పంచాయతీ రాజ్ శాఖలో ఉన్న ఈ రోడ్డును, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించి, డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. కానీ మార్గంలో రెండు వరుసల రోడ్డును నిర్మించకుండా, కేవలం రెన్యువల్ రోడ్డుతోనే సరిపెట్టింది. మండల కేంద్రాల నుంచి డబుల్ రోడ్డు కనెక్టివిటీ ఉండాలని ప్రభుత్వం చెబుతుండడంతో మళ్లీ ఈ మార్గంలో రెండు వరసల రోడ్డును నిర్మించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు చేసి పంపించారు.

రోడ్డును విస్తరించాలి



వంగపల్లి బైపాస్ నుంచి మోటకొండూర్ మండలానికి వెళ్లే రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించాలి. ఈ మార్గంలో వాహనాల రద్దీగా ఎక్కువగా ఉంటుంది. జిల్లా కేంద్రానికి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో పూర్తిగా పాడైపోయిన రోడ్డును అధికారులు రెన్యువల్‌తోనే సరిపెట్టారు.

– తోటకూరి అనురాధ, మాజీ జెడ్పీటీసీ

రాకపోకలు సాఫీగా సాగడం లేదు



నూతన మండలం ఏర్పడి ఐదు సంవత్సరాలు దాటినా, మండల కేంద్రానికి ఇప్పటి వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయలేదు. జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సింగిల్ రోడ్డు మాత్రమే ఉంది. రవాణ సౌకర్యం సాఫీగా జరగడం లేదు. రాత్రి సమయాల్లో ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు కిందకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

– గాజుల మల్లేష్, ఆరెగూడెం

ప్రతిపాదనలు పంపించాం

వంగపల్లి బైపాస్ నుంచి మోటకొండూర్‌కు వెళ్లే దారిలో డబుల్ రోడ్డు వేయాలని ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు అందించాం. గతంలో ఆర్అండ్‌బీ శాఖకు ఈ రోడ్డును అప్పటి ప్రభుత్వం అప్పగించింది. కానీ రెన్యువల్ బీటీ మాత్రమే వేయడం జరిగింది. మళ్లీ డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణం చేపడతాం.

– భరత్, ఆర్అండ్‌బీ ఏఈ

క్లుప్తంగా

విద్యార్థి దశ కీలకం

భువనగిరి: విద్యార్థి దశ కీలకమైందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే రాగిజావ పరిశీలించారు. తుక్కాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అభివృద్ధికి కృషి చేయాలి

భూదాన్‌పోచంపల్లి: రెడ్డి సామాజికవర్గంలో గల నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జ జగన్మోహన్ రెడ్డిని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకల జంగారెడ్డి, ఉపాధ్యక్షులు నోముల సైదుల్‌రెడ్డి, బద్దం బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూపాల్ రెడ్డి, కోశాధికారి సత్యంరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ఆలేరు: రాష్ట్రంలోని ఉద్యమకారులను ఏకం చేసేందుకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన 584 మండలాల యాత్ర శనివారం ఆలేరు నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలేరు పట్టణంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని మలిదశ ఉద్యమకారుల రాష్ట్ర నాయకులు చామశ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఆలేరు మలిదశ ఉద్యమకారుల కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ


షూస్ పంపిణీ చేస్తున్న బీర్ల శంకర్

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మల్లాపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం బీర్ల టీమ్ ఫౌండేషన్ చైర్మన్ బీర్ల శంకర్ షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చౌటుప్పల్ రూరల్: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు పొంగిపొర్లాయి. పొలాల్లోకి వరద రావడంతో పంటలు దెబ్బతిన్నాయి. దేవలమ్మ నాగారం నుంచి దండుమల్కాపురం వెళ్లే రోడ్డులో ఇటీవల వాగుపై బ్రిడ్జి నిర్మించారు. రాచకొండ గుట్టల నుంచి నీటి ప్రవాహం భారీగా రావడంతో వాగు కోతకు గురైంది. దీంతో వరి పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. చౌటుప్పల్ తహసీల్దార్ వీరబాయి, మండల వ్యవసాయాధికారి నాగరాజు శనివారం వాగును పరిశీలించారు. సుమారు 63 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. చిన్నకొండూరులో సుమారు 5 ఎకరాల పత్తి పంట నీట మునిగిందని నిర్ధారించారు.

ఎమర్జింగ్ టెక్నాలజీపై వర్క్‌షాప్

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దేశ్‌ముఖిలోని సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'ఎమర్జింగ్ టెక్నాలజీ' వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, నోడ్, జెఎస్ క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశి రాజశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కమలహాస్, ఏఐఎంఎల్ హెచ్‌ఓడీ డాక్టర్ సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరల్డ్ టాప్ సైంటిస్ట్ జాబితాలో రెహమాన్‌కు చోటు



భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ మెకానికల్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఎండీ రెహమాన్‌కు వరల్డ్ టాప్ 2% సైంటిస్ట్ జాబితాలో చోటు లభించిందని యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు శనివారం తెలిపారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ గత ఆగస్టు వరకు ఉత్తమ సైంటిస్టుల డేటాను తీసుకోవడంతో పాటు స్టాండర్డ్ సైన్స్ మేట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 44 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్‌ను పరిగణలోకి తీసుకొని ఈ ఫలితాలు వెల్లడించారని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు(ఎం): ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని తహసీల్దార్ లావణ్య, ఎంఈఓ కొత్త మహదేవ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 12 మందిని సన్మానించారు. వారిలో శ్రీనివాసరావు (పల్లెర్ల), సునిత(ఆత్మకూరు(ఎం), సైదులు(కూరెల్ల), సత్యం(ఆత్మకూరు(ఎం), రామకృష్ణ(పోతిరెడ్డిపల్లి), ఎల్లయ్య(కప్రాయపల్లి), సంతోష(తిమ్మాపురం), మోహన్‌కుమార్(పల్లెర్ల), శైలజ(రాఘవాపురం), చంద్రమౌళి(ఆత్మకూరు(ఎం), సంధ్యారాణి(కేజీబీవీ ఆత్మకూరు(ఎం) ఉన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

మోటకొండూరు : ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన అమ్మనబోలు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పాకాల అనురాధను శనివారం పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీసీ చైర్ పర్సన్ భార్గవి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమయ్య, ఉపాధ్యాయులు పరమేశ్వర్ పాల్గొన్నారు.


సన్మానం పొందిన ఉపాధ్యాయులు

నాయకత్వ లక్షణాలపై మహిళలకు వర్క్‌షాపు

బీబీనగర్: మండలంలోని మహదేవ్‌పురం గ్రామ పరిధిలో గల బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో శనివారం శివశక్తి లీడర్‌షిప్ అప్రోచ్ పేరిట నాయకత్వ లక్షణాలపై మహిళలకు వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అధ్యక్షురాలు సుదేశ్ దీదీ, డైరెక్టర్ షికాగోయల్, రాజకుమారి, సునిత పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్ర సందర్శన

తుర్కపల్లి: మల్లారెడ్డి రీసెర్చ్ యూనివర్సిటీలోని వ్యవసాయ శాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకట్ కళ్యాణ్ ఆధ్వర్యంలో శనివారం తుర్కపల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. సహజ వ్యవసాయ పద్ధతులు, రసాయన రహిత పంటల పెంపకంపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజ, డాక్టర్ కీర్తి, విక్రమ్ సాయి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

విత్తనాలను అభివృద్ధి చేసుకోవాలి

రామన్నపేట: రైతులు విత్తనాలను అభివృద్ధి చేసుకుని సాగుఖర్చులను తగ్గించు కోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ దామోదర్‌రాజు, డాక్టర్ శ్రావణి అన్నారు. శనివారం ఇంద్రపాలనగరం, శోభనాద్రిపురం, లక్ష్మాపురం గ్రామాల్లో పర్యటించి వరిచేలను పరిశీలించారు.

శ్రమదానం చేశారు.. గుంతలు పూడ్చారు


గుంతలు పూడుస్తున్న యూనియన్ సభ్యులు

రామన్నపేట: మండలంలోని వెల్లంకి గ్రామంలో గుండ్రాంపల్లి రోడ్డువెంట గల గుంతలను శనివారం స్థానిక శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో పూడ్చివేశారు. వారిలో యూనియన్ అధ్యక్షుడు గుడ్డేటి శ్రీనివాస్, సభ్యులు పినికేశి గోపాల్‌రెడ్డి, రాపోలు ఎల్లయ్య, పినికేశి వినోద్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సంద్ల గణేష్, నకిరేకంటి అశోక్, మల్లేష్ పాల్గొన్నారు.

పోరాడేది కమ్యూనిస్టులే

రామన్నపేట: నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. శుక్రవారం రాత్రి రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో అమరులయాది సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు వీర తెలంగాణ వీధినాటకాన్ని ప్రదర్శించారు. పలు కుటుంబాల వారు సీపీఎంలో చేరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, కూరెళ్ల నర్సింహాచారి, బోయిని ఆనంద్, కందుల హన్మంత్, జంపాల అండాలు గంటేపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎండీ జహంగీర్


అలుగు పోస్తున్న దండుమల్కాపురం చెరువు

చెరువులకు జలకళ

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు దండుమల్కాపురం, కైతాపురం, దేవలమ్మ నాగారం చెరువులోకి భారీగా వరద నీరు రావడంతో నిండుకుండలా మారి మత్తడి దూకుతున్నాయి. దండుమల్కాపురం చెరువులోకి రాచకొండ గుట్టల్లోని నీరు రావడంతో శనివారం ఉదయానికే నిండి అలుగు పారుతోంది. దీనికి లింక్ చెరువుగా ఉన్న కైతాపురం చెరువు, దీనిక కింద ఉన్న లక్కారం చెరువు, దేవలమ్మ నాగారం గ్రామంలోని చెరువులు నిండాయి. ఇక మూసీ కాల్వ ద్వారా ఇప్పటికే పెద్దకొండూరు, చిన్నకొండూరు ,సింగరాయ చెరువు, ఎస్.లింగోటం చెరువు ఇప్పటికే నిండుకుండలా ఉన్నాయి. పంతంగి, ఆరెగూడెం చెరువులు నిండితే మండలంలో అన్ని చెరువులు నిండినట్లే అవుతుంది.

మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి

భువనగిరిటౌన్ : పని ప్రదేశాల్లో మహిళా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలో మెప్మా ఆర్‌పీల యూనియన్ జిల్లా కార్యదర్శి రామసాని వసంత అధ్యక్షతన శ్రామిక మహిళా జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభానికి ముందు మహిళా సీనియర్ నాయకురాలు పొట్ట యాదమ్మ సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం రమ మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి పని ప్రదేశంలో కంప్లైంట్ బాక్స్ లు ఏర్పాటు చేయాలని ఉన్నా అమలుకావడం లేదన్నారు. సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ముక్కెర్ల వెంకటమ్మ, రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ) యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసాని వసంత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు కుసుమ కళ్యాణి, నాయకులు పరమేశ్వరి, అనిత పాల్గొన్నారు.


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న యాదమ్మ

కంటైనర్ లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరికి స్వల్పగాయాలు

చౌటుప్పల్ రూరల్: కంటైనర్‌ను కారు ఢీకొట్టిన ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ పరిధిలో శనివారం సాయంత్రం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఆదిబట్లలో నివాసముంటూ, ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కొల్ల అజయ్ రాంబాబు కుటుంబంతో కలిసి కారులో ఏపీలోని తన స్వస్థలానికి వెళ్తున్నాడు. చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ పరిధిలోకి రాగానే హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం దండుమైలారం క్రాస్ రోడ్ వద్ద యూటర్న్ తీసుకుని విజయవాడ వైపు మళ్లింది. డీసీఎంను తప్పించబోయే క్రమంలో పక్కనే వస్తున్న కంటైనర్‌ను పక్క నుంచి వీరి కారు ఢీకొట్టింది. కారు నడుపుతున్న అజయ్ రాంబాబుకు, అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై ఉన్న కారును రోడ్డు పక్కకు తీశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కుసుమ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాల తొలగింపు కొనసాగుతోంది. మొదటి రోజు శుక్రవారం జగదేవ్‌పూర్ చౌరస్తాలో ఆక్రమణలను తొలగించిన సిబ్బంది.. శనివారం ప్రధాన రహదారి వెంట ప్రారంభించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి రైతు బంజార్ వరకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించడంతో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలోని అక్రమ నిర్మాణాలను కూడా తొలగించాలని పట్టణవాసులు కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ఆలేరురూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రగతిని శనివారం ఆయన పరిశీలించారు.

వర్కట్‌పల్లిలో వైద్యశిబిరం

వలిగొండ : మండలంలోని వర్కట్‌పల్లి గ్రామంలో నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయి శోభ సందర్శించారు. ఆమె వెంట డాక్టర్ జ్యోతి, వెంకటరమణ, సుకన్య ఉన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి: మహిళలకు అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శిల్పిని కోరారు. శనివారం భువనగిరి పట్టణంలోని హన్మాన్‌వాడలో గల బస్తీదవాఖానలో స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ అర్పిత, మణికంఠ, స్వప్న, వినిత్‌రెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు, పెన్షనర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం భువనగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, ఇటుకల దేవేందర్ ఉన్నారు.

చేయూత పింఛన్లు పెంచాలి

బొమ్మలరామారం: చేయూత పింఛన్లు రూ.4వేల నుంచి రూ.6వేల వరకు పెంచాలని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు మైలారం జంగయ్య కోరారు. పింఛన్‌దారులు బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్, మాచన్‌పల్లి, మైసిరెడ్డి పల్లి, మల్యాల, పెద్దపర్వతాపూర్, తిర్మలగిరి గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట శనివారం నిరసన తెలిపారు.

పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు

గుండాల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్‌రావు, ఎంపీఓ సలీమ్, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు హాజరయ్యేలా చూడాలి

మోత్కూరు : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని మండల విద్యాధికారి గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మోత్కూరు జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

స్కూల్ ఆవరణలో మద్యం సేవిస్తే చర్యలు

రాజాపేట : పాఠశాల ఆవరణలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ దీపిక అన్నారు. రాజాపేట మండలంలోని సోమారం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆకతాయిలు మద్యం సేవించి ఖాళీ సీసాలు ప్రాంగణంలో పగలగొట్టిన విషయమై శనివారం విచారణ చేపట్టారు. ఆమె వెంట ఎస్ఐ నిరోష, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి

చౌటుప్పల్ : విద్యార్థులు జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి ఆలె చిరంజీవి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

చౌటుప్పల్ రూరల్: విద్యార్థులు సమాజంలో ఉన్నతంగా ఎదగాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు నూనె మాధవి, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం, నాయకులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు భూ పంపిణీ దివ్య ఔషధం

భువనగిరిటౌన్ : పేదరిక నిర్మూలనకు భూ పంపిణీ దివ్య ఔషధమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ అన్నారు. శనివారం భువనగిరిలోని స్థానిక సుందరయ్య భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు


ఆత్మకూరు(ఎం): సింగారం గ్రామంలోని పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు


భువనగిరి: జీనియస్ హైస్కూల్లో బతుకమ్మ వేడుకలు


భువనగిరి: శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


అడ్డగూడూరు: చిర్రగూడూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో..


రామన్నపేట : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు


భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..


గుండాల : సీతారాంపురం జెడ్పీఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు


తుర్కపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



బొమ్మలరామారం : మర్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..


మోత్కూరు : సాయి చైతన్య పాఠశాలలో..

చౌటుప్పల్‌లోని గాంధీపార్క్‌లో బతుకమ్మ వేడుకలు


చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు


స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కోమటిరెడ్డి లక్ష్మి

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గాంధీపార్క్‌లో శనివారం రాత్రి స్థానిక ట్రినిటీ హైస్కూల్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. విద్యుత్‌కాంతుల నడుమ ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆకర్షణగా నిలిచింది. ట్రినిటీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు స్థానిక మహిళలు సుమారు ఐదు వేల మంది వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ట్రినిటీ స్కూల్ చైర్మన్ కేవీబీ.కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, కోశాధికారి పోలోజు శ్రీలత, ప్రతినిధులు వనం మమత, ముటుకుల్లోజు నీరజ, బొబ్బిళ్ల సంధ్య, కాసర్ల మంజుల, కాంశెట్టి శైలజ, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.